120 ఫీట్ల పొడవు.. 80 ఫీట్ల వెడల్పు

సిద్ధమవుతున్న రజతోత్సవ వేదిక

సభ ఏర్పాట్లతో ఎల్కతుర్తికి కళ

వరంగల్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. భారీ బహిరంగ సభల నిర్వహణలో రికార్డులున్న బీఆర్ఎస్.. ఎల్కతుర్తి సభను అదే స్థాయిలో నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నది. లక్షలాది మంది ప్రజలు, తెలంగాణవాదులు, బీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు హాజరయ్యే రజతోత్సవ మహాసభ వేదిక నిర్మాణం మొదలైంది. 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పుతో వేదిక ఏర్పాటవుతున్నది. వేదిక నిర్మాణం కోసం కంకర పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 50 వేల వాహనాల్లో లక్షలాది మంది ఈ సభకు వస్తారనే అంచనా ఉండటంతో అందుకు అనుగుణంగా 1,213 ఎకరాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. 154 ఎకరాల్లో సభా ప్రాంగణం, 1,059 ఎకరాల్లో పార్కింగ్ వసతులు ఏర్పాటు చేస్తున్నారు. మహాసభ ప్రాంగణం మొత్తం చదును చేశారు. సిద్దిపేట, వరంగల్, కరీంనగర్ నుంచి జాతీయ రహదారి జంక్షన్‌గా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు అనువుగా ఉన్నది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అనుసంధానమయ్యేలా ఎల్కతుర్తి నుంచి జాతీయ రహదారులు ఉన్నాయి. రజతోత్సవ సభ ఏర్పాట్లతో ఎల్కతుర్తి కొత్త కళను సంతరించుకున్నది. నెల రోజుల్లోనే గుర్తుపట్టలేనంతగా ఎల్కతుర్తిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అభివృద్ధి అయ్యాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, సూచనలతో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు ఆధ్వర్యంలో మహాసభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా సభ...

తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా నిలిచిన బీఆర్ఎస్ 25 ఏండ్ల ఉద్యమ, అభివృద్ధి, రాజకీయ ప్రస్థానాన్ని వివరిస్తూనే... రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై భరోసానిచ్చేలా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఉంటుందని గులాబీ పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. ఏడాదిన్నరగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ, ముఖ్యంగా రైతులు, పేదలు ఆర్థికంగా సాధికారత వైపుగా అడుగులు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ఏడాదిన్నరగా సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో రాష్ట్ర పురోగతి మందగించింది. ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఆగమవుతున్నది. ఈ నేపథ్యంలో అన్ని వర్గాలకు అండగా నిలిచేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉంటుందని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా 2001 ఏప్రిల్‌లో ఆవిర్భవించిన బీఆర్ఎస్ అలుపెరుగని ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన విషయం విదితమే. 2014 నుంచి పదేండ్ల సుపరిపాలనతో తెలంగాణను బీఆర్ఎస్ దేశంలో అగ్రగామిగా నిలిపింది. రాష్ట్ర సాధన ఉద్యమం, 10 ఏండ్ల సుపరిపాలన కలయికగా ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ జరగనున్నది.

ప్రజలకు అండగా.. గులాబీ జెండా

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, ఏప్రిల్ 15 : తెలంగాణ ప్రజలకు గులాబీ జెండా అండగా నిలిచిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం పార్టీ మండలాధ్యక్షుడు బొల్లెద్దుల బాలరాజు అధ్యక్షతన మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించారు.

విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ సర్కార్: వేముల

మోర్తాడ్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో ఘోర వైఫల్యం చెంది, ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పాలన తీరుపై విసుగు చెందిన ప్రజల్లో మళ్లీ కేసీఆర్ రావాలన్న ఆకాంక్ష బలంగా ఏర్పడిందని, దీంతో ఇప్పుడు అందరూ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మెండోరా మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు మంగళవారం వేముల సమక్షంలో బీఆర్ఎఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కమ్మర్‌పల్లిలో వాల్‌రైటింగ్‌ను ప్రారంభించారు.

జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

మత్స్యగిరి నుంచి యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్కతుర్తి సభ తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మారిపోతుందని తెలిపారు. ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ మండలం మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదగిరిగుట్ట వరకు 40 కి.మీ. మేరకు బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించి, మాట్లాడారు. ఈ పాదయాత్ర మూడు రోజులపాటు సాగనుంది.

గులాబీ సేన రెడీ: మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 15: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావడానికి గులాబీ శ్రేణులు సిద్ధమయ్యారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తెలిపారు. సభను విజయవంతం చేసేలా ఇప్పటికే దిశానిర్దేశం చేసినట్టు చెప్పారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు రజతోత్సవ సభ వాల్‌రైటింగ్ రాశారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు వణుకు పుట్టాలి: గండ్ర

శాయంపేట, ఏప్రిల్ 15: ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్, బీజేపీలకు వణుకు పుట్టాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సభ విజయవంతానికి హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు.

భయపడం.. వేధిస్తే వదలం

- పింక్ బుక్‌లో బెదిరించినోళ్ల పేర్లు
- గ్యారెంటీలేని కాంగ్రెస్ హామీలు
- మాట తప్పడం ఆ పార్టీ నైజం
- మళ్లీ బాన్సువాడ బీఆర్ఎస్‌దే
- బీఆర్ఎస్ బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ సన్నాహక సమావేశాల్లో కల్వకుంట్ల కవిత
- ప్రొటోకాల్ కోసం దిగజారిన పోచారం: బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి
- పోచారం లక్ష్మీపుత్రుడు కాదు.. శనిపుత్రుడు: జీవన్‌రెడ్డి

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రూ.2 వేల విరాళాన్ని కవితకు అందజేస్తున్న సంగం తండాకు చెందిన గిరిజన మహిళ. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బెదిరింపులకు భయపడేదే లేదు.. అలాంటి వారు రాజకీయ నేతలైనా, అధికారులైనా వారి పేర్లను పింక్ బుక్‌లో రాస్తున్నాం.. అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవన సన్నాహక సమావేశాలకు మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డితోపాటు కవిత హాజరయ్యారు. తొలుత తెలంగాణ తల్లికి పుష్పాంజలి ఘటించి, గులాబీ జెండాను ఎగురవేశారు. సంగం తండాకు చెందిన ఓ గిరిజన మహిళ బీఆర్ఎస్‌కు విరాళంగా రూ.2 వేలను అందజేశారు. అనంతరం గులాబీ శ్రేణులను ఉద్దేశించి కవిత ప్రసంగించారు. కొందరు కాంగ్రెస్ నాయకులు, అధికారులు బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే చాన్స్ లేదని స్పష్టంచేశారు. తమ కార్యకర్తలను అకారణంగా పోలీస్‌స్టేషన్లకు ఈడ్చిన వారినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. గులాబీ కండువాను బెదిరిస్తామంటే భయపడేవాళ్లు ఎవ్వరూ లేరని తేల్చిచెప్పారు. బాన్సువాడలో ఉప ఎన్నిక వస్తే తప్పకుండా బీఆర్ఎస్ పార్టీయే మళ్లీ గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. 'బాన్సువాడకు హైదరాబాద్ నుంచి వస్తుండగా దారిలో ఓ తమ్ముడు ప్రేమతో పలుకరించిండి. ఇంకా ఎన్ని రోజులు ఈ దరిద్రం. తొందరగా ఈ ప్రభుత్వాన్ని దించండని ఆ తమ్ముడు అడిగిండు' అని కవిత తెపారు. 15 నెలల్లోనే ఇంత వ్యతిరేకతను మూటగట్టుకున్న ఈ ప్రభుత్వానికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. ఈ 15 నెలల్లో మంచికి బదులుగా చెడే ఎక్కువ చేశారని విమర్శించారు. ప్రజలకోసం కాకుండా పైసల కోసం స్థానిక నాయకులు వలసలు పోయారని పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి కవిత పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ పండుగకు ఇంటికొకరు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పోచారానికి ఇసుక, డబ్బే కావాలి: బాజిరెడ్డి

రాళ్ల గుట్టలు, మంజీరాలో ఇసుక, డబ్బులు మాత్రమే పోచారం శ్రీనివాసరెడ్డికి కావాలని, ఆయనకు నిజాయితీ అవసరం లేదని ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఎద్దేవా చేశారు. రానున్న కాలంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అని ధీమా వ్యక్తం చేశారు. పోచారం చెప్పే మాటలు విని పోలీసులు వేధిస్తే ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హయాంలో బాన్సువాడకు కేసీఆర్ కోట్లాది రూపాయల నిధులిచ్చినా, సిగ్గులేకుండా పార్టీ మారాడని మండిపడ్డారు. సలహాదారుగా నియమితుడై ప్రొటోకాల్ కోసం దిగజారిపోయాడని విమర్శించారు.

పోచారం నమ్మకద్రోహి: జీవన్‌రెడ్డి

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి నమ్మకద్రోహి, వెన్నుపోటుదారుడని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తెలంగాణ పాలిట కేసీఆర్ దేవుడైతే, బాన్సువాడ పాలిట బకాసురుడు, ప్రజల పాలిట నరకాసురుడు పోచారమని విమర్శించారు. పోచారంను కేసీఆర్ లక్ష్మీపుత్రుడిగా భావిస్తే, శనిపుత్రుడిగా మారాడని మండిపడ్డారు. పార్టీ ఆపదలో ఉన్న సమయంలో పోచారం మరోపార్టీలో చేరి తీరని ద్రోహం చేశాడని మండిపడ్డారు. బాన్సువాడకు పోచారం సౌభాగ్యం కాదని, ప్రజల దౌర్భాగ్యమని మండిపడ్డారు. తిన్నింటి వాసాలు లెక్కబెట్టే పోచారంలాంటి విశ్వాస ఘాతకులను ప్రజలు క్షమించరని స్పష్టంచేశారు. బాన్సువాడ నియోజకవర్గం కోసం పోచారం అడిగినన్ని నిధులు కాదనకుండా కేసీఆర్ మంజూరు చేశారని తెలిపారు.

'విస్తరణ' తర్వాత ప్రభుత్వం కూలుడు ఖాయం: ఎర్రబెల్లి

తొర్రూరు, ఏప్రిల్ 15: క్యాబినెట్ విస్తరణ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీలో ఉన్నప్పటి నుంచే రేవంత్‌రెడ్డి బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నాడని, తాను చాలాసార్లు చెప్పినా వైఖరి మార్చుకోలేదని తెలిపారు. రేవంత్ తన శిష్యుడే అయినా, అతడి ప్రవర్తనను ఎప్పుడూ సహించలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే రాజకీయాల్లోంచి తప్పుకుంటానని స్పష్టంచేశారు.

గులాబీ శ్రేణులు తరలిరావాలి: పుట్ట

కాటారం, ఏప్రిల్ 15 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మంథని నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలో మల్హార్, కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల సమావేశాల్లో మాట్లాడారు.

రజతోత్సవ సభకు ప్రతిఒక్కరూ కదలిరావాలి

- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు
- ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ఆహ్వానం

ఇల్లెందు, ఏప్రిల్ 15 : హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గం నుంచి ప్రతి ఒక్కరూ కదలిరావాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అధ్యక్షతన ఇల్లెందులోని జగదాంబ సెంటర్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసి పక్కనే ఉన్న గోడపై రజతోత్సవ ప్రచార వాల్ రైటింగ్‌ను ప్రారంభించారు. 7వ వార్డులో ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఎల్కతుర్తి సభకు రావాలని ఆహ్వానించారు. అనంతరం భారీ ర్యాలీతో పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని, స్థానిక ఫంక్షన్ హాలులో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దిరాజు, రేగా మాట్లాడుతూ.. ప్రజలను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పతనం బీఆర్ఎస్ రజతోత్సవ సభతో ప్రారంభమవుతుందని వారు చెప్పారు. అనంతరం వారు రజతోత్సవ సభ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

ఇల్లెందులోని 7వ వార్డులో ఓ ఇంటికి వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి రజతోత్సవ సభకు రావాలని ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఎంపీ వద్దిరాజు, నాయకులు

ఎల్కతుర్తిలో సభావేదిక పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

సభ చరిత్రలో నిలిచిపోతుంది: వినోద్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 15 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయని వినోద్‌కుమార్ తెలిపారు. 500మంది ప్రతినిధులు కూర్చునేలా సభా వేదికను ఏర్పాటు చేస్తున్నామని వొడితెల సతీశ్‌కుమార్ తెలిపారు.

రజతోత్సవ వేడుకకు ఆటోడ్రైవర్ల విరాళం

గోదావరిఖని, ఏప్రిల్ 15: పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ నాయకులు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రూ.50వేల విరాళాన్ని ప్రకటించారు. మంగళవారం గోదావరిఖనిలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిసి నగదు అందజేశారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎంగా కేసీఆర్ ఆటోడ్రైవర్లను కడుపులో పెట్టుకుని కాపాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో ఆటోవాలాల బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు.

GOOD NEWS TO FARMERS

భారత ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య ఎస్.ఓ. 2900 (ఇ), తేది: 24-10-2015 వ్యవసాయ సహకార మరియు రైతు సంక్షేమ శాఖ ప్రకారం మేము ఈ క్రింది తెలిపిన 100% నీటిలో కరిగిపోయే మిశ్రమ ఎరువులను ద్రవ/గుళికల రూపంలో దిగుమతి/తయారు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేయగలమని తెలియజేస్తున్నాము:

S.No.	Type of Fertilizers	Nutrient Percentage
1	N:P:K	19:19:19
2	N:P:K	00:00:50
3	N:P:K:Mg:B	15:05:30:2:0.02
4	N:P:K	24:24:16
5	N:P:K	15:08:35
6	N:P:K	13:40:13
7	N:P:K:S	16:00:09:19
8	N:P:K	10:05:30
9	N:P:K	28:28:00
10	N:P:K:S	9:27:18:7.5
11	N:P:K	20:20:20

పై ఎరువులు పంటల అభివృద్ధికి మరియు అధిక దిగుబడుల కొరకు సహకరించును.

తయారు మరియు సరఫరా చేయువారు:
M/s. Astra agritech Private Limited, Shed No. 10-22, Plot No. 25/A, Survey No. 35, Block No. 9, TSIIC, Phase I, IDA, Cherlapally (V), Kapra (M), Medchal-Malkajgiri District-500 051, Telangana. E-mail ID : astraagritech@gmail.com.
Toll Free : +91-6309297158

కూలి పనిచేసిన బీఆర్ఎస్ యువజన విభాగం

సిద్దిపేట, ఏప్రిల్ 15 : ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు మేరకు సిద్దిపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నిమ్మ రజినీకాంత్‌రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువజన విభాగం నాయకులు మంగళవారం కూలి పని చేశారు. కరీంనగర్ రోడ్డులో గల గౌరీ మిర్చిబండి వద్ద ఒక్కరోజు కూలి పని చేసినట్టు వారు తెలిపారు. ఇందుకు మిర్చి బండి యజమాని కూలీగా రూ.3000 ఇచ్చారని వెల్లడించారు.